

# పొద్దు తిరుగుడు పూవు

పుట్టిన ప్రతి ప్రాణికి ఆశలుండటం సహజం. కాని అవి తీరటం ఏ కొద్దిమంది అదృష్ట వంతులకో! కొంతమంది ఆశలతోనే పుట్టి, ఆశలతోనే అణగారి పోతారు. అటువంటిదే పొద్దుతిరుగుడుపూవు జీవితం.

పొద్దుతిరుగుడుపూవుకు ఆశలు జాస్తి, అవకాశాలు నాస్తి. పుట్టినరోజునుండి సూర్యుడినే ఆరాధిస్తుంది. కన్ను, ముక్కు, ముఖం సర్వం అతడికే అర్పితంచేసి తనకంటూ ఏదీ మిగుల్చుకోక అటుకేసే చూస్తూ

ళ్లంతా తిరిగింది. నర్సిందే పదిమాట్లు సర్సింది.

ఆ రోజునుండి వరసగా పదిరోజులు దానికి రాత్రిళ్ళు నిద్ర పట్టలేదు. పదోనాటి అర్ధరాత్రి పెద్దగాలి దుమ్ము రావటం స్వయంగా చూచింది. పిథికిటికీలోనుండి ఇంత దుమ్ము, ఇంత మట్టి దానిమీద పడి మనిషిని పూర్తిగా ముంచివేసింది. పదకొండో రోజు తెల్లవారకముందే భాస్కరరావుపెళ్ళి స్థిరపడిం దంటూ సూర్యకాంతానికి తెలిసింది. కండ్లల్లో దుమ్ము ఏదో పడ్డట్లు నటిస్తూ కొంగుతో అద్దుకుంటూ పెరటిలోనికి పారిపోయింది. అక్కడ తనతోపాటే పుట్టిపెరిగిన మల్లెతీగ రాత్రి గాలిదుమ్ముకి గుంజ విరిగి నేలమీద కుప్పకూలిపోయింది! రెక్కలు విరిగి కూలినపక్షిలానిస్సహాయంగా. నిస్పత్తువగా కనపడుతూన్న మల్లెతీగను చూచిన సూర్యకాంతం "మనమిరువురమూ ఒక జాతివాళ్ళమే" అంటూ నిట్టూర్చింది. మల్లెతీగ పేరుమీద తన హృదయంలోని బాధంతా తల్లితో చెప్పుకొని కుమిలికుమిలి ఏడ్చింది.

'భాస్కరరావునుకలుసుకుంటే...?'ఏమనిఅడగటం?' ఆ మూగజీవి తనకు నోరు ఇవ్వమని కోటిదేవతలకు మొక్కుకుంది. ధైర్యంచేసి ఎదురింటికి పోయింది.

"రావే, కోడలా! కంట్లో నలుసై పోయావు."

భాస్కరరావు తల్లి సూర్యకాంతాన్ని ఆప్యాయంగా దగ్గిరికి తీసుకుంది. ఆమె ఆహ్వానానికి ఎందుకో భయంతో ఆశంకించింది సూర్యకాంతం హృదయం.

భాస్కరరావు గదిలో అద్దంముందు కూర్చుని స్నో పులుముకుంటున్నాడు. లోపలికి పోదామా? వద్దా? అనే జిజ్ఞాసలో పడిపోయింది సూర్యకాంతం. దడదడలాడే గుండె చిక్కబట్టి లోపలికి అడుగు పెట్టింది. అది రావటం అద్దంలోనే చూచిన భాస్కరరావు మందహాసంతో వెనక్కి తిరిగి "రా రా. నేనే వద్దామనుకుంటుంటే నీవే వచ్చావు, సూరీడూ" అన్నాడు.

సూర్యకాంతం శరీరానికి చిరుచెమట పట్టింది. 'నాకోసమే వద్దామనుకున్నాడు.' మనసులో అనుకుంది. సంతోషంతో గుండె గొంతుకలోనికి వచ్చినంత పని అయింది.

"విన్నావుగా. నాకీ పెళ్ళి చేసుకోవటం అంత ఇష్టంగా లేదు. చదువు పూర్తిఅయిన తరవాత చేసుకోవాలని ఉంది. కానీ ఏమి చేస్తాం? నాన్నదగ్గిర దమ్మిడీ లేదన్నాడు. ఎట్లా సంపాదించాడో నాన్న బంగారుబాతులాంటివాణ్ని సంపాదించాడు. చదువంతా వాళ్ళ ఖర్చుమీదే చదువుకోవచ్చు. నీఅభిప్రాయమేమిటి? నేనీ సంబంధం చేసుకోవటం నీ కిష్టమా? కాదా?" అన్నాడు.

సూర్యకాంతం గొంతు తడి ఆరిపోయింది. భాస్కరరావు మాట్లాడుతూఉన్నంతసేపు ముళ్ళమీద కూర్చున్నట్లు ఇబ్బంది పడింది. 'ఏదో తన గొడవ చెప్పుకోవాలనివస్తే తననే మధ్యవర్తిని చేస్తున్నాడు. అయినా అన్నీ కుదిరి పెళ్ళికోసం ఎదురుచూచేతరుణంలో నా సలహా ఏమిటి?' అనుకుంది సూర్యకాంతం.

"మాట్లాడవేం, సూరీడూ! నీకీ పెళ్ళి ఇష్టం లేకపోతేచెప్పు. నిమిషాలమీద రద్దుచేసుకుంటాను. ముహూర్తాలుగట్రా పెట్టుకున్నా ఫరవాలేదు."

"దీనికేం లక్షణంగా ఉంది. నిన్ను చదివిస్తూ


ASP TIL T 29 TEL




పుష్టికరమైన తుషార్ మీ యింట్లో వంటలకు చాలా మంచిది. ఎ, డి విటమిన్లు కలిగివున్న తుషార్ వంటకా లను రుచికరం చేయడమే, తుషార్‌తో వండిన వంటకాలు రుచికరంగా వుండడమేగాక మీ వంటికి చాలా మంచిది.

తుంగభద్ర
ఇండస్ట్రీస్ లి॥,
కర్నూలు:

తుషార్‌తో వండిన వంటకాలు అత్యంత రుచికరం.



రంటున్నావుగా. చేసుకుంటేనే బాగుంటుంది.'' గబగబా ఆ నాలుగుముక్కలు అనేసి సూర్యకాంతం పోవటానికి లేచింది.

''అట్లా బుద్ధి చెప్పవమ్మా, కోడలా! రోజూ చెప్పలేక నా ప్రాణం కడబట్టిపోతూంది. వాళ్ళకి ఎందుకో భాస్కరంమీద గురి కుదిరింది. మా అమ్మాయిని మీ అబ్బాయికే ఇస్తామంటూ ఒకటే బ్రతిమాలటం అనుకో. అయినా వాళ్ళకేం తక్కువ? వంద ఎకరాల మెట్ట. పాతిక ఎకరాల పల్లం. తోటలూ, దొడ్లూ, గొడ్లూ, గోదా అంతా దేవేంద్రలోకం అనుకో... పిల్లకూడా రవ్వ. నువ్వు చూడలేదుగాని కోడలా, ఎంత బావుంటుందని . . .'' అంటూ భాస్కరం తల్లి లోపలికి వచ్చింది.

భాస్కరం తల్లిఅతిశయానికి నవ్వాడు. సూర్యకాంతం రానినవ్వుతో ఏడిచినట్లు ఇకిలించి ''వస్తాఅత్తయ్యా!'' అంటూ వీథిలోనికి అడుగువేసింది.

సూర్యకాంతం భాస్కరరావుతో ఏదో చెప్పుకుందామని ఎన్నో ఆశలతో బయలుదేరింది. అవకాశంకోసం ఎదురుతెన్నులు చూసింది. అది కాస్త లభ్యమయ్యేసరికి నోరు కాస్త నొక్కుపడిపోయింది. సూర్యకాంతం తన జీవితంలో ఇట్లాంటివెన్నో చూసింది. ఇదికూడా అట్లాంటిదే కాగూడదనుకుంది. కాని తరుణం జారిపోతూంది. ముహూర్తాలుకూడా పెట్టుకున్నారట.'తానుఇప్పుడు...ఇప్పుడు ఏంచేయాలి? ఏ ఆలోచనా వచ్చి చావటంలేదు.'

తల్లి కొంగు వేలికి చుట్టుకుంటూ గుటకలు మింగింది సూర్యకాంతం. తల్లి 'ఏమిటే?' అంది. ఏం చెబుతుంది సూర్యకాంతం? పెళ్ళిసంబంధం కుదిరిన భాస్కరరావుని తాను పెళ్ళాడదలుచుకొన్నట్లు ఏ కన్నెపిల్ల, అయినా నోరువిడిచి చెప్పగలదా? ఇటువంటి వ్యవహారాలు తలిదండ్రులే ఆమూకీ లాగి చక్కబెట్టాలి. సూర్యకాంతం తలిదండ్రులకు ఎప్పుడూ శ్రమ కలిగించలేదు. ఇప్పుడుమాత్రం కలిగిస్తుందా? గుమస్తా ''భాస్కరరావు పెళ్ళిటగా, అమ్మా'' అన్నది.

''అవునే! ఇంకా వారంరోజులుందట.''

సూర్యకాంతానికి కళ్ళవెంట నీరు తిరిగింది. తల్లి కూతురు భావం గ్రహించింది. మనసు చివుక్కుమంది. ఆమెకుమాత్రం తెలియదూ కూతురు మనసు? రోజూ చూస్తూనేఉండె, భాస్కరరావు వీథిలోకి వచ్చేటప్పుడు, పోయేటప్పుడు కూతురు కిటికీదగ్గర పడే పాట్లు. పాపం! తమ స్థితిగతులు తెలిసిన ఆ తల్లి మాత్రం ఏం చేస్తుంది? పాపం! దొంగలా తలకాయ వంచుకుంది.

''అమ్మా!'' మళ్ళీ పిలిచింది కూతురు.

''ఏమిటమ్మా?''

''భాస్కరరావు చాలా మంచివాడు కాదామ్మా.''

''అవునే. చాలా మంచివాడు.''

''మరిఅయితే ఇప్పుడెట్లమ్మా?'' సూర్యకాంతం గొంతు కేటుకుంది.

కూతురు పడే బాధకు ఆ తల్లి హృదయం గిలగిలలాడింది. ఆమె శరీరం ఒడ్డుమీదికి విసిరేసిన చేపపిల్లలా కంపించింది. తామూ చిన్నప్పుడు ఎన్ని ఆశలు పెట్టుకుందో . . . ఇప్పుడా ఆశలుకన్న సంతానం కళ్ళలో చూచి కన్నీళ్ళు పెట్టింది.

''నా కడుపున ఎందుకు పుట్టావే, ఏ శ్రీమంతుడి ఇంట్లోనో పుట్టక? భాస్కరానికి ఇంజనీరుచదువు చెప్పిస్తున్నారట.''

మనసులోని ఆవేదన బిడ్డతో వెళ్ళబోసుకోలేక దోషిలా ఆమె వెళ్ళిపోయింది. ఉన్నదనుకున్న చివరి ఆశ కాస్త కూకటివేళ్ళతో పెల్లగించుకపోయేసరికి సూర్యకాంతని దిక్కు చచ్చిపోయింది. ''ఏం చేయాలి? తానిప్పుడేం చేయాలి భగవాన్!'' కిటికీచువ్వల్ని విరగగొడుతున్నట్లు గట్టిగా పిడికిళ్ళతో పట్టి కండ్లు మూసుకుంది.

వారం అంటే ఎన్ని రోజులని? చూస్తుండగానే వచ్చివేసింది ఆ రోజు. ఈ వారం రోజులు సూర్యకాంతాన్ని ఇంటిలోవాళ్ళెవరూ పలకరించలేదు. నిద్రలేక జేవురించిన ముఖంతో కనపడుతూన్న సూర్యకాంతంమీద తలా ఒక కన్ను పారేసిఉంచారు. ఏమి అఘాయిత్యం చేస్తుందోనని అల్లాడిపోతున్నారు. సూర్యకాంతం అటువంటిదేమీ చేయలేదు. అట్లా ఎప్పుడు చేసిందని? సూర్యకాంతం అట్లాచేసేదే అయితే ఇప్పటికి వందల మాట్లు చచ్చి ఉండేది. వాళ్ళభయమే కాని దానికటువంటి ఆలోచనలే రావు.

ఎదురింటిముందు అలగోజీ మోగుతూంది. భాస్కరరావు ఉపనయనం అయిపోయింది. పెళ్ళికి తరలిపోవటానికి ముందుగా కాశీకి పోతున్నాడు.

సన్నగా తీగలా రాగాలొలికిస్తూన్న అలగోజీ నాదం గుండెల్ని కోసేస్తూంది. చువ్వలను పట్టుకొని కిటికీలో ముడుచుకొని కూర్చున్న సూర్యకాంతం బుగ్గలమీద బాష్పాలు కాలవలు నిర్మిస్తున్నాయి. ఆస్తిఅంతా క్షణంలో హరించిపోయిన కోటీశ్వరుడిలా నిరాశా నిస్పృహలతో నీరుగారిపోతూ శూన్యంలోకి చూస్తూంది సూర్యకాంతం.

వీథిలో భాస్కరరావు చుట్టూర అంతా మూగారు. తలకి గుడ్డ, చంకలో గొడుగు, చేతిలో కమండలం, ముఖాన బొట్టు, బుగ్గన కాటుక, పాదాలకు పారాణితో అందంగా తయారయ్యాడు భాస్కరరావు.

ఎవరో పిల్లవాడు బహుశా బావమరిది అవుతాడు కాబోలు భాస్కరరావు కాళ్ళు కడిగి నెత్తిమీద నీళ్ళు చల్లుకున్నాడు. పక్కగా ఉన్నవాళ్ళు చెప్పినట్లు చిలకలా పలుకుతూ ''బావా! కాశీ కెందుకు పోతావు? మా అక్కయ్యనిచ్చి పెళ్ళిచేస్తాంరా!'' అన్నాడు. భాస్కరరావు సిగ్గుపడుతూ మూతిని సున్నాలా చుట్టి ''ఊహూ'' అన్నాడు. చుట్టూమూగిన ఆడవాళ్ళు కిసుక్కుమంటూ పమిటలు నోట్లో కుక్కుకున్నారు. సూర్యకాంతం గుండె కళుక్కుమంది. ఓణితో ఏడుపు ఆపుకుంది.

కొంచెంసేపటికి అంతా తరలి వెళ్ళిపోతారు. రాత్రికి సెళ్ళయిపోతుంది. తన జీవితం చీకటిని పులుముకుంటుంది. ఇన్నాళ్ళబట్టి పెంచుకుంటున్న ఆశల తీగలు ఐశ్వర్యం అనే లవిత్రంతో పుటుక్కున తెగిపోతాయి. 'నాకోసం కాశీప్రయాణం కట్టవలసిన వాడు మరొకరికోసం కడుతున్నాడు. నా మెడలో పుస్తె కట్టవలసినవాడు మరొకరికి కట్టటానికి బయలుదేరుతున్నాడు. చీకటి...చీకటి.,. అంతా చీకటి! నా జీవితమే చీకటి.' సూర్యకాంతం గొణిగింది.

'అమ్మకి సిగ్గయినా లేదేం? అందరితోబాటు భాస్కరరావుచేష్టలకి నవ్వుతూంది. ఎత్తువళ్ళు అందరికీ



రంగుల పొంగులు

ఫోటో—ఎమ్. ఎస్. శ్రీనివాసమూర్తి

(హైదరాబాదు—29)

కనపడేలా ఇకిలించాలి గావును. తన పిల్లని చేసుకోలేదని ఏడవవలసిందిపోయి, ఏమిటా నవ్వు గుండెలని బద్దలు చేసేటట్లు?. . . ఛీ! ఇంత అవమానం జరుగుతున్నా ఇంకా బ్రతికేఉందేం? తన పిల్లకి జరిగిందొకటి తనకి జరిగిందొకటా? పైగా, నవ్వటం ..ఎట్లా నవ్వుతుందో చూడు, పక్కనున్నవాళ్ళకి అసహ్యం వేసేటట్లు. . .' తల్లిమీద ఎప్పుడూ లేనిది సూర్యకాంతానికి అసహ్యం పుట్టుకువచ్చింది.

భాస్కరరావు లోపలికి వెళ్ళిపోయాడు. సూర్యకాంతం కళ్ళముందు కదలాడే వెలుగును మబ్బుల మసకలు కమ్మేశాయి.

కొంతమంది జీవితా లటువంటివి. కొందరు అదృష్టవంతుల జీవితం కలలను ఇలగా మార్చివేస్తుంది. మరికొందరు దురదృష్టవంతులుంటారు. వారికీ ఇలలో లభ్యంకావలసిన కనీస అవసరాలు కలలోతప్ప మరొకచోట లభ్యంకావు. పొద్దుతిరుగుడుపూవు తన జీవితాన్ని పదిలంగా భాస్కరుని పాదాలముందర అర్పణచేసుకుంది. ప్రతిరోజు ఉదయంనుండి సాయంత్రంవరకు అతడి నోట అంగీకారశబ్దం వినాలని తహతహలాడుతుంది. అతడు కనిపించని నాలుగు ఘడియలు అతడిమీద ధ్యానతోనే ఎదురుతెన్నులు చూస్తూ గడుపుతుంది. చివరికి తన జీవితాన్ని కాస్త ఆ నిరీక్షణలోనే త్యాగం చేస్తుంది. పొద్దుతిరుగుడుపూవుకు సంస్కృతీకరణం సూర్యకాంతం. అటువంటి పేరుగల వాళ్ళ జీవితాలన్నీ అట్లాగే ముగుస్తాయికాబోలు!

సూర్యకాంతం బరువెక్కిన గుండెతో కిటికీలో నుండి లేచి మంచంమీద పండుకుని ముసుగు పెట్టింది. మళ్ళీ ఏమైనా కలగంటానికో ఏమో! ★